
# నిర్ణయం




డా.తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం

యశస్విని కారు ఇంటి ముందు ఆపుతోన్నప్పుడు గమనించింది తమ ఇంటి ముందు మరో కారు ఆగి ఉండడం. నారింజ రంగులో ఉన్న స్విఫ్ట్ కారు. వచ్చిన వాళ్లెవరై ఉంటారో యశస్విని ఊహకు అందలేదు. తమ పరిచయస్తులలో ఆ కారు ఉన్న వాళ్లెవరో గుర్తుకు రాలేదు.

"తినబోతూ రుచెందుకు?" అనుకుంటూ లోపలికి నడిచింది.

"వచ్చావా యశూ! ఇవాళ బాగా ఆలస్యమైనట్టు ఉంది.." అన్నాడు యశస్విని తండ్రి హరిహరరావు.

"మామూలే కద నన్నా.. ట్రాఫిక్ జామ్.. నిజానికి ఎలక్ట్రానిక్ సిటీ నుండి మల్లేశ్వరం రావడానికి మహా అంటే ముప్పావుగంట కన్నా పట్టకూడదు. కానీ మన బెంగుళూరు మహానగరం ట్రాఫిక్‌లో ఆ దూరం ప్రయాణించడానికి గంటన్నర పైనే పడుతుంది" అలసటగా అని లోపలికి వెళ్లిపోయిందిగానీ అక్కడ హాల్లో అమ్మానాన్నలతో బాటు తనకు పరిచయం లేని మరొక దంపతులు కూర్చుని ఉండడం చూసి, పలకరించకుండా వెళ్లడం సభ్యత కాదేమో ననుకుని, వాళ్లెవరో చెప్తారా అన్నట్టు తల్లి వైపు చూసింది.

తల్లి కావేరి దృష్టంతా వడలిపోయి నల్లబడి కనబడుతున్న యశస్విని ముఖం మీదే ఉంది.

"వెళ్లేటప్పుడు అప్పుడే విచ్చిన పువ్వులా నవనవలాడుతూ తాజాగా ఉంటావు. వచ్చేసరికి ఊళ్లో ఉన్న పొల్యూషన్ అంతా నీ ముఖం మీదే కనబడుతుంది" అన్నదావిడ.


"ఇండియాలో ఏ పెద్ద నగరంలోనైనా ఇదే పరిస్థితి కదమ్మా.. అందుకే మరి అమెరికాకు ఉద్యోగాల మీద వెళ్లిన మనవాళ్లు తిరిగి వెనక్కి రావాలంటే భయపడతారు. ఈ ట్రాఫిక్ భయమొకటి, ప్రతి పనికీ లంచాలు లేనిదే జరగదనే భయమొకటీ మనవాళ్లను అక్కడే ఉంచేస్తున్నాయి." హరిహరరావుకి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్న అతిథి తానుగా సంభాషణలో పాల్పంచుకుంటూ అన్నాడు.

వెలిసిపోయిన రంగులో ఉన్న జీన్స్ ప్యాంటు మీద బిగుతుగా ఉన్న సిల్క్ షర్టులో ఉన్న యశస్వినిని ఆపాదమస్తకం పరిశీలనగా చూస్తూ కూర్చున్న ఆయన భార్య అందుకుంది. "అమెరికాలోని ఫాషన్లు, పద్ధతులు అయితే మన వాళ్లు సులభంగా పాటించేస్తున్నారు గానీ అక్కడి శుభ్రత, క్రమశిక్షణ నేర్చుకోవాలంటే ఇంకో పదేళ్లు చాలదు" అన్నదావిడ.

అప్పుడు తోచినట్టుగా వారిద్దరినీ కూతురికి పరిచయం చేశాడు హరిహరరావు. "యశూ! వీరు పాండురంగగారని హైద్రాబాద్‌లో ఉంటున్నారు. చీఫ్ ఇంజనీరుగా రిటైరయ్యారు. వారి భార్య రుక్మిణి నీటిపారుదల శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. వారి అమ్మాయి అవంతిక ఈ ఊళ్లో 'డెల్' కంపెనీలో చేస్తుందట. అబ్బాయి అనిల్ కాలిఫోర్నియాలో పనిచేస్తున్నాట్ట" అని కూతురికి చెప్పి "మా అమ్మాయి యశస్విని.. విప్రోలో పనిచేస్తుంది" అని వారికి చెప్పి పరిచయ కార్యక్రమం ముగించాడు.

తండ్రి వారి గురించి చెప్పిన తీరులోనే విషయమేమిటో యశస్వినికి అర్థమయ్యింది. అయినా ఏమీ తెలియనట్టే "నమస్తే అంకుల్.. నమస్తే ఆంటీ" అనేసి లోపలికి నడిచింది. కూతురి వెనకాలే తనూ లోపలికి వచ్చింది కావేరి.

వంటింట్లోకి వెళ్లగానే అంతవరకు అణచుకున్న చిరాకు ప్రదర్శిస్తూ "ఏమిటమ్మా ఇది? నేను మొన్ననే చెప్పాను. ఇంకొక సంవత్సరం నా పెళ్లి గురించి మాట్లాడవద్దని...



నాతో చెప్పకుండా పిలిపించారు గనుక మీరే ఏం మాట్లాడుతారో మాట్లాడి పంపించండి. నన్ను మాత్రం ఇప్పుడు సంప్రదాయ సిద్ధంగా చీరె కట్టుకుని, జడ వేసుకుని వచ్చి వాళ్ల ముందు కూర్చోమంటే ఒప్పుకోను..” అంది విసురుగా.

అప్పుడే లోపలకు వచ్చిన హరిహరరావు కూతురి కోపాన్ని చల్లబరుస్తూ తలమీద చెయ్యి వేసి నిమిరాడు.

“పొరబాటు పడుతున్నావురా అమ్మా! వాళ్లని మేము పిలిపించలేదు. వాళ్లకి ఎవరి ద్వారానో మన గురించి తెలిసిందట. వాళ్ల అబ్బాయి వచ్చేవారం ఇండియాకు వస్తున్నాడట. పదిహేను రోజులు ఉంటాడట. ఆ లోపుగా పెళ్లి చేసి పంపించాలని సంబంధాల కోసం చూస్తున్నార్ట. మేము కూడా నీ ఫోటో వివరాలు శంకర మఠంలో పెళ్లికూతుళ్ల జాబితాలో రిజిస్టర్ చేశాం కదా! వెళ్లి వివరాలు చూసుకుని, వాళ్లకు నచ్చి మనను వెదుక్కుంటూ వచ్చారు. ముందు ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకుని వచ్చి వాళ్లతో అయిదు నిముషాలు మాట్లాడు. ఈ లోపుగా మీ అమ్మ కాఫీ, ఫలహారాలు ఇస్తుంది. వాళ్లు వెళ్లిపోయాక మనం తీరికగా మాట్లాడుకుందాం!” అన్నాడు.

తండ్రి మాట కాదనలేక, ఇష్టం లేకపోయినా మర్యాద కోసం చిరునవ్వును ముఖానికి అతికించుకుని మళ్లీ వాళ్ల ముందుకు వచ్చి కూర్చుంది యశస్విని.

లేత నీలిరంగు చీరె కట్టుకుని, ముఖాన చిన్న బొట్టు పెట్టుకుని, వదులుగా వదిలేసిన జుత్తుకు రబ్బర్ బ్యాండు వేసుకుని, కడిగిన ముత్యంలా వచ్చి కూర్చున్న యశస్విని వైపు సంతృప్తిగా చూసింది రుక్మిణి.

వాళ్ల అబ్బాయి పనిచేస్తున్న కంపెనీ గురించి, అతని జీతభత్యాల గురించీ చెప్పి చివరగా తమకు కట్నకానుకల మీద ఆశ లేదనీ, అమ్మాయికి మంచి చదువు, ఉద్యోగంలో అనుభవం ఉంది గనుక అక్కడికి వెళ్లాక ఆమెకు సులభంగానే ఉద్యోగం దొరికివాళ్లు సుఖంగా ఉంటే చాలనీ చెప్పి వెళ్లిపోయారు పాండురంగ, రుక్మిణి.

“మనంతట మనం పదిమందిని అడిగినా, ఇంటర్‌నెట్‌లో గాలించినా ఇంత కంటే మంచి సంబంధం దొరుకుతుందనుకోను నీకేమిటి అభ్యంతరం?” అంది కావేరి.

“అమ్మా! అన్నీ తెలిసి మళ్లీ ఇలా మాట్లాడుతున్నావేమిటి? వచ్చేనెల నేనా అమెరికా వెళ్లాల్సి వస్తుందని చెప్పాను కదా. కనీసం ఒక సంవత్సరం అక్కడ ఉండాల్సి వస్తుంది. అక్కడి నుండి వచ్చిన తరువాతనే నా పెళ్లి గురించి ఆలోచిద్దామని చెప్పాను కదమ్మా..” నీరసంగా అంది యశస్విని.

“యశూ! ఇప్పుడీ సంబంధం వెదుక్కుంటూ రావడం నిజంగా మన అదృష్టం అనుకోవాలి. నువ్వు ఒంటరిగా స్టేట్స్‌కి వెళ్తావంటే మాకెందుకో చాలా దిగులుగా ఉంది. అదే నువ్వు పెళ్లి చేసుకుని వెళ్తే మా మనసుకి సమాధానంగా ఉంటుంది. ఇంకో విషయం చెప్పనా? ఇలా జరగడం కాకతాళీయమే కావొచ్చు గానీ నువ్వు మీ కంపెనీ తరపున వెళ్లాల్సింది కాలిఫోర్నియాలోని శాంటక్లారా నగరానికే కావడం, ఇవాళ వెదుక్కుంటూ వచ్చిన వాళ్ల అబ్బాయి ఉద్యోగం చేసేది కూడా అక్కడే కావటం ఎంత అనుకూలం? రోగి కోరింది పాలే, వైద్యుడు పథ్యంగా చెప్పింది పాలే అన్నట్టు ఈ సంబంధం గనుక కుదిరితే నీ గురించి మాకు దిగులు ఉండదు. నిశ్చింతగా ఉండగలము” అన్నాడు హరిహరరావు.

తండ్రి చెప్పిన విషయం విని ఆలోచనలో పడింది యశస్విని.

వారం గడిచింది. అనిల్ అమెరికా నుండి వచ్చాడని వాళ్లు హైద్రాబాద్ నుండి ఫోన్ చేశారు. అనిల్ తన చెల్లెల్ని చూడడానికి బెంగుళూరు వస్తున్నాడనీ, అదే సమయంలో యశస్వినిని కలిసి మాట్లాడాలనుకుంటున్నాడనీ చెప్పారు.

యశస్వినీతో సంప్రదించకుండానే తమ అంగీకారం తెలిపారు హరిహరరావు, కావేరి.

ఈ వారం రోజులూ యశస్విని తన కంపెనీ తరపున వీసా కోసం దరఖాస్తు చేయడం, తను పనిచేయబోయే కంపెనీలో పనిచేసేవారితో ఫోనులో పరిచయం చేసుకోవడం, ప్రాజెక్ట్ గురించిన వివరాలు తెలుసుకోవడం, దానికి కావల్సిన విషయ సేకరణ మొదలైన విషయాలతో మునిగి తేలుతున్నది.

అనిల్ వాళ్ల ఇంటికి వచ్చినరోజు సాయంత్రం కూడా ఆలస్యంగా ఇల్లు చేరింది యశస్విని.

ఓపికగా ఎదురుచూస్తూ కూర్చున్నాడు అనిల్. అనిల్ ఫోటోలో కనిపించిన దానికన్నా మనిషి చాలా బాగున్నాడు. అయిదడుగుల పది అంగుళాల ఎత్తు, చామనచాయ అయినా కళ గల ముఖం, చురుకైన చక్కని కళ్లు, చూడగానే ఆకర్షించే రూపంతో ఏ ఆడపిల్లకు అయినా కలల రాజకుమారుడిలా ఉన్నాడు.

యశస్విని ఇంట్లోకి రాగానే కూర్చుని ఉన్నవాడల్లా లేచి నిలబడి ‘హాయ్’ అంటూ పలుకరించాడు.

“హాలో.. ఒక్క నిముషం.. ముఖం కడుక్కుని వస్తాను” అంటూ లోపలికి వచ్చింది యశస్విని.

అతని కోసం అంటూ ప్రత్యేకంగా తయారవ్వడం బాగుండదు అనుకుంటూనే తనకు ఎంతో నచ్చిన గులాబి రంగు క్రేప్ సిల్కు చీరె కట్టుకుని, ముఖానికి కొద్దిగా కాంపాక్ట్ పౌడరు అద్దుకుని, బొట్టు దిద్దుకుని బయటకు వచ్చింది.

అనిల్ ఆమెతో చిరకాల స్నేహితునిలా

## క్రేజీ జెనీలియా

అందంలో, అభినయంలో జెనీలియాకి మంచి మార్కులే పడతాయి. ఒకవిధంగా ‘బొమ్మరిల్లు’ ఆమె కెరీర్‌ని మలుపు తిప్పిన చిత్రమే! ఢీ, రెడీ లాంటి వరస హిట్లతో ముందుకు దూసుకుపోతున్న జెనీలియా కొత్త చిత్రం ‘శశిరేఖాపరిణయం’ సూపర్ ఫ్లాప్ కావడంతో ఆమె కాస్త డీలా పడిందనే చెప్పాలి. కానీ ఆమెకింకా చాలా ఆఫర్లున్నాయి. ఒక్క సినిమా ఫ్లాప్ అయినంత మాత్రాన ఏమీకాదు. ఆమెకి హిట్ హీరోయిన్‌గా ప్రేక్షకుల్లో ఒక గుర్తింపు ఎప్పుడో వచ్చేసింది. క్రేజీ హీరోయిన్ జెనీలియా హిట్ చిత్రం మళ్లీ ఎప్పుడో?



ఆత్మీయంగా మాట్లాడాడు. ఆమె ఉద్యోగ వివరాలు, చేబట్టబోయే ప్రాజెక్టు వివరాలు అన్నీ అడిగి కనుక్కున్నాడు. కానీ యశస్వినికి కొంత విచిత్రంగా అనిపించిన విషయమేమంటే ఆమె అడిగినా కూడా తన ఉద్యోగం, కంపెనీలకు సంబంధించిన విషయాల గురించి మాట్లాడడానికి ఉత్సాహం చూపించలేదు.

సంభాషణ యథాలాపంగా అమెరికాలో ప్రస్తుతం చోటుచేసుకున్న ఆర్థిక మాంద్యం గురించి, ఇళ్లు, స్థలాల కొనుగోలుకు బ్యాంకులు ముందు వెనుక ఆలోచించకుండా రుణాలు ఇవ్వడం, ఇళ్ల ఖరీదులు ఆకాశాన్ని అందుకునేట్టు పెరిగిపోవడం గురించీ, ఒక్కసారిగా ఆ బుడగ పేలిపోయి 'సబ్‌ప్రైమ్' లెండింగ్ వలన అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోవడం గురించీ సాగింది. క్రెడిట్ కార్డుల మీద కూడా ఎటువంటి ఆంక్షలు, నిబంధనలు లేకుండా అప్పులు ఇవ్వడం వలన మరొక ముప్పు ముంచుకురావడం గురించీ మాట్లాడుకున్నారు.

అమెరికాలో కంపెనీలు వేలకొలదీ ఉద్యోగులకు పింక్ కార్డులిచ్చి పంపేయడం గురించి అడుగుతూ "ఐ.టి.లో మనవాళ్లకు కూడా ఉద్యోగాలు పోతున్నాయంటారా?" అని హరిహరరావు అడిగాడు.

ఆ విషయం గురించిన సంభాషణలో అనిల్ పాల్గొనడానికి ఉత్సాహం చూపలేదు. వేరే సంగతులు ప్రస్తావిస్తూ యశస్వినికి ఆమె కంపెనీ వారు అమెరికాలో ఇవ్వబోయే జీతం గురించీ, ఉండడానికి వసతి గురించీ మాట్లాడాడు. అనిల్ వెళ్లిపోయాక హరిహరరావు, కావేరి ఇద్దరూ అబ్బాయి గురించి సదభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. యశస్విని తన మనసులో మాట ఏమిటో బయటకు చెప్పడానికి వ్యవధి కావాలన్నట్టు మౌనం వహించింది.

మరుసటి రోజు సాయంత్రానికల్లా పాండురంగ గారు ఫోనుచేశారు. అనిల్ కోసం ఇంచుమించు పది, పదిహేను సంబంధాల దాకా చూసామనీ, ఇంచుమించు అందరు అమ్మాయిలు బి.టెక్ లేక ఎమ్.సి.ఎ చేసి ఐ.టి. ఉద్యోగాలలో ఉన్నవారేననీ, అయితే అనిల్‌కి యశస్విని నచ్చిందనీ, వాళ్లకి అంగీకారమైతే నిశ్చయ తాంబూలాలు తీసుకుని పది రోజులలోపు వివాహం జరిపేట్టు ముహూర్తాలు పెట్టుకుందామనీ చెప్పాడు ఆయన.

రుక్మిణిగారయితే అమ్మాయికి వారు కొనవలసిన చీరెలు, నగల గురించి కూడా ప్రస్తావించింది.

రుక్మిణి మాటలు విన్న కావేరి ముఖం కూతురి పెళ్లి నిశ్చయమైందన్న సంతోషంతో కళకళలాడింది. హరిహరరావుగారు ఆనందం దాచుకోలేక యశస్విని ఆ సమయంలో చాలా పనిలో ఉంటుందని తెలిసినా ఫోను చేసి విషయం చెప్పారు.

"నాకు చెప్పకుండా మీరు వాళ్లకి మాట ఇవ్వకండి నాన్న. నేను ఇంటికి వచ్చాక మాట్లాడుకుందాం" అన్నది యశస్విని ఏమాత్రం ఉత్సాహం, ఉద్వేగం లేకుండా. తల్లికి ఫోను ఇవ్వమని ప్రత్యేకంగా అడిగి "అమ్మా! నువ్వు హడావుడిగా ఫోన్లు చేసి పెద్దమ్మలకు, మావయ్యకు 'యశా' పెళ్లి కుదిరింది అంటూ టముకు వేయకు ప్లీజ్. కాస్త ఓపిక పట్టు.. సరేనా?" అని ఫోను పెట్టేసింది.

ఆ రోజు సాయంత్రం శంకర మఠంకు వెళ్లిన కావేరికి పరిచయస్థులు నలుగురు కనబడ్డారక్కడ. వాళ్లు కూడా కూతుళ్ల కోసం వరుళ్లను వెదుకుతున్నవాళ్లే.

"ఏమో కావేరీ! పరిగెత్తి పాలుతాగే కన్నా నిలబడి నీళ్లు తాగడం మేలని.. ఎక్కడో విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారి గురించి ఏమీ తెలియకుండా పిల్లల్ని ఇవ్వడం కంటే మన దేశంలోనే ఉద్యోగాలు చేస్తున్నవాళ్లను చూడ్డం మేలనిపిస్తుంది. అందులో ఈ మధ్యన అమెరికాలో ఉద్యోగాలు ఉంటాయో ఊడుతాయో అనేట్టు ఉన్నాయిట కూడాను" అన్నది కామాక్షి అనే ఆవిడ. మిగతా ముగ్గురు ఇంచుమించు అదే అభిప్రాయం వ్యక్తపరిచారు. ఆలోచనలో పడి ఇల్లు చేరింది కావేరి.

సాయంత్రం ఎనిమిదింటికి ఇంటికి వచ్చిన యశస్విని చాలా అలసటగా కనబడింది. పాండురంగగారి ఫోను సంభాషణ గురించి పొడిగించలేదు హరిహరరావు కూడా.

రాత్రి పడుకునే ముందు అమ్మానాన్నల దగ్గరికి వచ్చి కూర్చుంది యశస్విని.

"పాండురంగగారు మన సంబంధం ఖాయం చేసుకోడానికి తొందర పడడానికి కారణం తెలిసింది నాన్నా!" అంది ప్రశాంతంగా.

ఉలికిపడి ఏమిటన్నట్టు చూశాడు హరిహరరావు. కామాక్షి వాళ్లు చెప్పిన విషయాలు గుర్తొచ్చాయి కావేరికి.

"అనిల్ ప్రస్తుతం 'బెంచ్' మీద ఉన్నాడుట నాన్నా. అంటే ఉద్యోగం లేనట్టే.. ఎప్పుడు వస్తుందో కూడా తెలియదు. ఈ పరిస్థితిలో చేతిలో ఉద్యోగంతో అతను ఉంటున్న ఊరికే వెళ్లబోతున్న నా గురించి వాళ్లకి తెలిసింది. అందుకనే వెదుక్కుంటూ వచ్చారు. అతని కోసం పన్నెండు సంబంధాలు చూసిన మాట నిజమేగానీ వాళ్లను అనిల్ తిరస్కరించలేదు. వాళ్లే ఎన్.ఆర్.ఐ. సంబంధం వద్దని వదులుకున్నార్ట. ఈ మధ్యన చాలా మంది ఆడపిల్లల తల్లిదండ్రులు అమెరికాలో ఉద్యోగాలలో ఉన్న యువకులకు పిల్లలనివ్వడానికి జంకుతున్నారు. ఉద్యోగ భద్రత విషయంగా అనుమానాలతో బాటు, అక్కడ కూడా కట్నం గురించిన వేధింపులు, గృహహింస చోటు చేసుకుంటున్నట్టు పేపర్లో వస్తున్న వార్తలు కూడా కారణం. వాళ్ల తల్లిదండ్రుల మాట ఎటున్నా కనీసం అనిల్ నిజాయితీగా ప్రస్తుతం తనకు ఉద్యోగం లేదన్న విషయాన్ని చెప్పి ఉంటే అదొక రకంగా ఉండేది. మనం గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమంటే మన భారతీయ పురుషపుంగవులకు భార్య తమ కన్నా ఎక్కువ చదువుకున్నదో, సంపాదన గలదో అయితే సహించే గుణం అస్సలు లేదు. ఆత్మన్యూనతతో భార్యను హింసించినా ఆశ్చర్యం లేదు" అని ఊరుకుంది యశస్విని 'నిర్ణయం మీదే' అన్నట్టు.

ఆ రోజు హరిహరరావు పాండురంగకు ఫోన్ చేశాడు.

"మీకు మా సంబంధం నచ్చిందని అన్నారు. సంతోషం. కానీ మా అమ్మాయిని ఇండియాలో ఉద్యోగం చేస్తూ ఉండే వరుడికే ఇవ్వాలని మేం నిర్ణయించుకున్నాం. సారీ... క్షమించండి" అని చెప్పి ఫోను పెట్టేశాడు.

☆

